
# ఋతు సంహారం



165

డా॥ వి. చంద్రశేఖరరావు



కోమలి హఠాత్తుగా ఏ ఆఫీసు ముందో ధర్నా చేస్తున్న స్త్రీలతో కనపడి, ఉద్రేకంగా అరుస్తూ కేకలు వేస్తూ, మీ ఆవిడే కదూ అంటూ నా కొలీగ్స్ నావైపు వింతగా చూస్తుంటారు. రాత్రంతా కోమలి సెల్ మోగుతూనే ఉంటుంది. అదో హాట్‌లైన్ నెంబరు. గృహహింస ఆత్మహత్యల వాళ్ళు రోడ్డు ప్రమాదాల వాళ్ళు ఏ విపత్తుకయినా ఆ నెంబరే. ఒకసారి పేరెడ్‌గ్రౌండ్‌లో వీధి బాలలతో ఫుట్‌బాల్ మ్యాచ్ జరుపుతూ, ఇంకోసారి ఇంటింటికి తిరిగి పాతబట్టలు సేకరిస్తూ, కోమలికి సామాజికసేవ అంటే ఎంతో ఇష్టం. టెలికాంలో మంచి ఉద్యోగాన్ని వదిలి సోషల్ సర్వీసు పేరుతో ఒక ఎన్.జి.వో. లో చేరింది.

కోమలిది సున్నితమైన మనసు. ఎవరి దుఃఖానికయినా ఇట్టే చలించిపోతుంది. కోమలి తన చిన్నతనంలో జరిగిన ఒక విషాదాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుని కళ్ళనీళ్ళు పెడుతుంది. కోమలికి ఆరేళ్ళప్పుడు వాళ్ళ నాన్న చనిపోయాడు. బట్టలషాపు, బియ్యం అమ్మకం ఏ వ్యాపారమూ కలిసి రాలేదు. ఎప్పుడూ దిగులుతో ఉండేవాడు. సముద్రంలో మునిగి ఊపిరాడనట్లుగా ఉండేవాడు. తాగుడు మొదలుపెట్టాడు. కానీ ఎన్ని సీసాలు పోసినా ఆ దుఃఖం తీరేది కాదు. ఒక అర్ధరాత్రి బెడ్‌రూమ్‌లో ఫ్యానుకు ఉరి వేసుకొని చనిపోయాడు. "ఆ దృశ్యం నాకు ఇంకా గుర్తుంది. ఆ చావు గదిలో నేను గిలగిల కొట్టుకుంటున్నాను. ఏం జరుగుతుందో నాకు తెలియట్లేదు. అమ్మ ఎందుకు ఏడుస్తుందో అర్థం కాలేదు. గదంతా చల్లగా ఊపిరాడకుండా ఫ్రిజ్‌లో కూర్చోబెట్టినట్లుగా, గాలి అందక నేనూ చచ్చిపోతానేమో అనుకునేదాన్ని," అని పదేపదే గుర్తు చేసుకొనేది.

హైదరాబాద్ వచ్చిన కొత్తలో మేముండే సింగిల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్ గురించి చాలాసార్లు, “ఇది చావుల గదిలా వుంది. ఊపిరాడట్లేదు,” అంటూ రాత్రంతా మేల్కొని కాస్సేపు కిటికీలు తెరిచి బయటకు వెళ్ళి తలుపు పక్కనే నేలపై పడుకొని “హైదరాబాద్ మనకు ఏర్పడ్డ ఆపద,” అని డిక్లేర్ చేసేది.

ప్రతిరోజు ఆఫీసు నుంచి ఒక దు:ఖగాథ మోసుకొచ్చేది. “సిటీ ఒక పెద్ద మ్యాన్ ఈటర్ అయిపోయింది. ఏదో ఒకరోజు ఇది సర్వ నాశనమై పోతుంది,” అని శపించేది. “పెట్రోలు పోసి భార్యల్ని తగుల బెట్టేవాళ్ళు, హాకీబ్యాట్‌తో ప్రియురాళ్ళ తలలు పగులగొట్టేవాళ్ళు, డబ్బు కోసం పసి పిల్లల్ని కిడ్నాప్ చేసి గోనెసంచుల్లో కుక్కేవాళ్ళు- ఇది మనుషులు బతికే నగరమా, ఇది చావుల విడిది,” అనేది. ఏదో ఒకరోజు ఈ సిటీపై ఏ ప్రళయమో విరుచుకుపడి సర్వం నాశనమవుతుందని కోమలి గట్టి నమ్మకం.

అట్లాంటి ఒక సందర్భం ఆ వారం ఎదురయింది.

ఆదివారం టీవీలో ఒక ప్రత్యేకమైన వార్త టెలికాస్ట్ చేస్తూనే ఉన్నారు. అది ఆకాశంలో ఒక వింత, ఎర్రగా నారింజపండు రంగులో మెరుస్తున్న ఒక వస్తువు గురించి. ఆ రంగు ప్రత్యేకంగా మునుపెన్నడూ చూడనట్లుగా, దాని చుట్టూ వెలుగులు విరజిమ్ముతున్నట్లు, అదో వెలుగుల ఫౌంటెన్‌లా వుందని, వాటిని ఎగిరే పళ్ళాలని, మరో గ్రహం నుంచి వచ్చిన జీవులు మనమధ్యనే ఎగురుతున్నాయని కొంత మంది శాస్త్రజ్ఞులు అంటున్నారరని, మరికొద్దిమంది విధ్వంసకరమైన గ్రహాలేవో చిన్నచిన్న శకలాలుగా విచ్ఛిన్నమై, భూమిపై వేలాడుతున్నాయని తీర్మానించారరని, మొత్తానికి ఇది సిటీ ఎదుర్కోబోతున్న సరికొత్త ఆపదని తీర్మానించారు.





కోమలి ఆ రాత్రంతా నిద్రపోలేదు. రాత్రంతా టెర్రస్‌పైనే గడిపింది. ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లు రెప్పలార్పకుండా ఆకాశం వైపే చూడసాగింది. కోమలిలో ఏదో కలవరపాటు అవాంఛితాన్ని చూసినట్లుగా. ఆ రాత్రంతా భయంభయంగానే గడిపింది. చాలా రోజులపాటు ఎగిరే పళ్ళాల గురించి వార్తలు టీవీలో వస్తూనే వున్నాయి. కోమలి చాలాసార్లు కిటికీలోంచి, కాస్సేపు టెర్రస్‌పైనించి వాటికోసం వెతుకుతూనే వుంది. ఈ ఉదంతం తరువాత కోమలిలో చాలా మార్పులు వచ్చాయి. వుండీ వుండీ పెద్దగా ఏడుస్తుంది. శ్వాస ఆడటం లేదంటూ, ''చనిపోతానేమో అనిపిస్తోంది. రండి, మీరు ఇద్దరూ నా పక్కనే కూర్చోండి,'' అంటూ నన్ను జయంతుడిని పక్కనే కూర్చోబెట్టుకుంది. కోమలిని డాక్టరుకి చూపించాల్సి వచ్చింది. ప్రతిరోజు నిద్రపోయే ముందు ఒక ట్రాంక్విలైజర్ వేయాల్సి వచ్చింది.

ఇట్లాంటి మానసికమైన ఇబ్బందులు కోమలికి మాత్రమేకాక సిటీ అంతటాకొన్ని వేలమందికి వచ్చాయని పేపర్లో వార్త. ముఖ్యంగా స్త్రీలలో ఇట్లాంటి మూడ్ వేరియేషన్స్ వస్తున్నాయని వైద్యులు తీర్మానించారు. సిటీ అంతటా ఫ్రీ సైకలాజికల్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు.

కోమలి ముభావంగానే ఉంటుంది దేనిపైనా ఆసక్తి లేనట్లుగా. నాలోనూ ఏదో మార్పు. ఆకాశంలోని వెలుగు గురించే ఆలోచిస్తున్నాను. ఆ ఆలోచన క్రమంగా ఆందోళన అయ్యింది. రేపు ఏమవుతుందోనని భయం. విచిత్రంగా ఈ మార్పుల గురించి, నా మిత్రులు కూడా చెబుతున్నారు. మేం మాటాడుకునేటప్పుడు, మా మధ్యన వందలకొద్దీ నిట్టూర్పులు, దిగులు చూపులు. ఇవికాక, మా జీవితంలో కలిగిన అతి ముఖ్యమైన మార్పు, మేము సరిగ్గా నిద్రపోలేకపోతున్నాము. రాత్రిళ్ళు కాపలాకాసే దీపాల్లా మా కళ్ళు తెరుచుకునే ఉంటున్నాయి.

మాకు తెలియకుండానే మాలో చిత్రమైన మార్పులు వచ్చాయి. స్నేహితుల్ని ఇంటికి పిలవటం మానివేశాము. కోమలి ఎప్పుడూ అలిసిపోయినట్లుగా ఉంటుంది. అన్నం వండదు. కర్రీస్ పాయింట్ నుంచి కూరలు తెప్పిస్తుంది. పక్క వీథిలోని ఇరానీ రెస్టా రెంట్ నుంచి రోటీలు తెప్పిస్తుంది. అదే మా ఆహారం. మా సెల్‌ఫోన్లు మూగబోయి ఉంటాయి, ఇల్లు నిశ్శబ్దంగా ఉంటుంది.

కోమలి ఇల్లు ఊడవటం మానివేసింది. ఇంటి నిండా పేరుకు పోయిన చెత్త. ఎప్పుడైనా పక్షి ఒకటి మా అపార్ట్‌మెంట్ ముందు వయ్యారంగా నిలబడి, కిచకిచమని పలకరిస్తే, దానివైపు అనుమానం గా చూస్తున్నాము. కిటికీలోంచి మా పైకి దయగా జాలువారే వెన్నెల వైపు అసహనంగా చూస్తాము. 'వెన్నెలకేల మా పై కోపం' అంటూ తెల్లతెల్లగా మాపై రాలుతున్న వెన్నెల ధూమంపై ధుమధుమ లాడతాము.

మరో మూడు నెలలు గడిచాయి. వింతలు కొనసాగుతూనే ఉన్నాయి. నా కొలీగ్స్ ప్రవర్తనలోనూ మార్పులు గమనించాను. వాళ్ళు చాలా రెస్ట్‌లెస్‌గా ఉంటున్నారు. అలజడిగా, కోపంగా, చిన్న విషయానికే బరెస్ట్ అవుతున్నారు. ఈ మూడు నెలల్లో వెయ్యికి పైగా ఆత్మహత్యలు నమోదు అయ్యాయి, సిటీలో. స్ట్రైక్‌లు, బందులు, మనుషులు, సమూహాలుగా చీలిపోయి, కొట్లాటలు, దొమ్మీలు, జీవితం భరించలేనంత చేదుగా ఉంది.

సిటీ అంతా ఫ్లైయింగ్ సాసర్స్ గురించిన చర్చే, చానల్స్ అన్నిటా, ప్రైమ్‌టైమ్ స్టోరీ అయ్యింది. రోడ్డు పైన నడుస్తూ, హఠాత్తుగా పైకి చూసి, తీక్షణమైన ఏ వెలుగు కనబడినా, 'యస్, దె ఆర్ కమింగ్' అంటూ గొణు క్కుంటున్నారు. సిటీలో కనబడే ప్రతి కొత్త మార్పుకు కారణం, ఆకాశం వైపు చూపిస్తున్నారు.





మా యింట్లో రాత్రులన్నీ దుఃఖస్వప్నాలుగా ఉంటున్నాయి. మా ఇప్పటి సమస్య, జయంతుడి జ్వరం. ఎనిమిదవ రోజు. అన్ని టెస్ట్‌లు నెగిటివ్ వచ్చాయి. కానీ టెంపరేచర్ తగ్గటం లేదు.

రాత్రి పదకొండు అయ్యింది. ఒంటరి ఆకాశం, నిరంతర శబ్దాల రాత్రి, పరుపుపై నిస్తేజంగా పడుకొన్న పిల్లవాడి పక్కన కూర్చుని, వాడి తల నిమురుతూ, మధ్యమధ్యలో వాడు ఉలిక్కిపడి లేస్తున్నాడు. వాడి వీపును, తలను నిమురుతూ, నిద్రపుచ్చుతూ, పరుపుపై ఆ చివర కోమలి నిద్రపోతుందో లేదో తెలియదు.

కర్టెన్లు తీసి, కిటికీలు తెరిచి, క్షణంపాటు చల్లటిగాలి గదిలోకి తోసుకు వచ్చింది. నారింజ పండు రంగు వెలుగు కళ్ళ ముందు తళు క్కుమంది. మునిపటిలా, ఆ వెలుగును చూసి ఉలిక్కిపడటం లేదు మేము. నగర జీవనంలో భాగమయినాయి యు.ఎఫ్.ఓ.లు. ఇది భ్రమో, నిజమో తేల్చుకోలేకపోతున్నాము. ఒట్టి భ్రమే కానీ, క్రమం గా అది బలపడి మూఢ విశ్వాసంగా మారుతున్నదేమో అనిపిస్తుంది.

జయంతుడి తల నిమురుతూ, వాడిపక్కనే కూర్చుని, అట్లాగే నిద్రపొయ్యాను. మగతనిద్రలో కోమలి కలలోకి వచ్చింది. ఇరవై యేళ్ల కోమలి బస్టాప్‌లో నిలబడి ఉంది. నేను మోటారు సైకిల్ పై వెళు తున్నాను. నన్ను ఆపి లిఫ్ట్ కావాలని అడిగింది. "ఎక్కడిదాకా," అన్నాను. మనోహరమైన నవ్వు నవ్వి, "ఏదైనా హోటల్‌కి తీసు కెళ్ళు," అంది. సినిమాల్లో హీరో, హీరోయిన్లలా చేతిలో చెయ్యి వేసుకొని రెస్టారెంట్‌లోకి వెళ్ళాము. దమ్ కా బిర్యాని ఆర్డర్ చేశాము. చిన్నచిన్న కబుర్లు. ట్రాఫిక్‌జామ్‌ల గురించి, వానలు, నీళ్ళు నిండిన వీథుల గురించి. "ఫ్లయింగ్ సాసర్స్ గురించి విన్నావా" అని అడిగాను. కోమలి మార్మికంగా నవ్వింది. లోపల 'రెయిన్ డాన్స్' జరుగుతుంది, వెళ్దాం అంది. వానలో తడుస్తూ వందలమంది. వాళ్ళంతా నగ్నంగా

ఉన్నారు. ముఖాలకు, పంది తలలు మాస్కులుగా పెట్టుకొని మా ముఖాల చుట్టూ పందుల తలలు మొలుచుకొచ్చాయి. మేం డాన్స్ చేస్తుండగా, "ఊపిరాడటం లేదు, చచ్చిపోయేలా ఉన్నాను," అంటూ పెద్దగా అరిచింది కోమలి. హోటల్ నుంచి బయటకు వచ్చాము. తలెత్తి పైకి చూస్తే, ఆకాశమంతా నిండిన అతి పెద్ద ఫ్లైయింగ్ సాసర్. ఎటు చూసినా నారింజపండు రంగు కాంతి, తెరలు తెరలుగా.

కళ్ళు తెరిచేసరికి, పిల్లవాడు పెద్దగా మూలుగుతున్నాడు. గాఢంగా శ్వాస తీస్తున్నాడు. $103^0$ జ్వరం. ఎనిమిది రోజులుగా జ్వరం అక్కడే ఉంది. ఎన్ని యాంటిబయాటిక్స్ ఇచ్చినా జ్వరం తగ్గటం లేదు. వాడి పక్కనే కూర్చుని, వాడి వీపు నిమురుతూ "రేపు స్కూల్లో ఇంటర్వ్యూ కదా నాన్నా," అన్నాడు వాడు. టెక్నో స్కూల్లో చేర్చడానికి, రేపు వ్రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఉన్నాయి. ఆరో తరగతి నుంచే ఐఐటి ఎంట్రెన్స్‌కు కోచింగ్. ఈ పరీక్ష పాసయ్యే తీరాలి. కోమలి పడుకునే ఉంది. శ్వాస తీస్తున్నట్లుగా శబ్దం. కానీ తన కళ్ళు తెరుచుకునే ఉన్నాయి.

మరుసటి రోజు ఉదయం జయంతుడి జ్వరం ఒక డిగ్రీ తగ్గింది. "స్కూలుకు వెళ్దాం నాన్నా, ఎంట్రెన్స్ టెస్ట్ రాస్తాను," అన్నాడు. నేను వద్దు అనలేకపొయ్యాను. కోమలి నిర్లిప్తంగా మావైపు చూస్తుంది. స్కూలు బయట, వరండాలో, ఒక చెట్టు కింద నేనూ, జయంతుడు, కోమలి, చెట్ల ఆకుల్లో కదలికలు లేవు. చెట్లపై పక్షుల సవ్వడి వినిపించటం లేదు. ఎండ వేడి, కొరడాలతో ఝళిపించినట్లు. కోమలి తలను దించుకొని, భూమితో మాట్లాడుతున్నట్లుగా కూర్చుంది. తల పైకెత్తి నావైపు ప్రశ్న గుర్తులా చూసింది. ఆమె ముఖంలో మోయలేనంత అలసట. హఠాత్తుగా, తన రెండు చేతుల్ని సాచి, తలను ఆకాశం వైపు తిప్పింది. అజ్ఞాతశక్తికి దాసోహం అన్నట్లుగా ఉంది ఆమె భంగిమ.





కాసేపయినాక, నావైపు తీక్షణంగా చూసి, ''నేను వెళ్ళిపో తున్నాను, ఇక ఇక్కడ ఉండలేను. విసుగు, అలసట, చీదర,'' అంది. ''ఏదీ మునుపటిలాగా లేదు,'' అంటూ బయటకు నడిచింది.

గది లోపల జయంతుడు పరీక్ష రాస్తున్నాడు. స్కూల్ బయట రోడ్డుపై ఊరేగింపు. కోమలి గేటు పక్కన నిలబడి ఉంది. స్ట్రీట్ థియేటర్ గ్రూపువాళ్ళు, పాటలు పాడుతూ వెళుతున్నారు. ''మనిషి ఏమయినాడురా,'' అంటూ ఆ పాట. కోమలి, ఆ పాట పాడేవాళ్ళతో కాస్త దూరం నడిచి, మళ్ళీ వెనక్కు వచ్చింది.

జయంతుడు పరీక్ష రాసి వచ్చాడు. 'గ్లోబల్ వార్మింగ్,' గురించి అడిగారని చెప్పాడు. ఇంటర్వ్యూలో, 'పిల్లవాడి మదర్ ఎక్కడ,' అని అడిగారు. కోమలి స్కూలు బయటే నిలబడి ఉంది. తనకేమీ సంబంధం లేనట్లుగా నాలుగైదు ప్రశ్నలు వేసి, డెబ్భై వేలు తీసుకొని, వచ్చేవారం రమ్మని చెప్పారు.

మేం ఇంటికి వస్తుండగా, ఆకాశం నిప్పులకొలిమిలా అగ్ని శ్వాసల్ని కక్కుతుంది. ఆకాశంలో ఇవాళ స్పష్టంగా నారింజపండు రంగు వెలుగు మిరుమిట్లు గొలుపుతూ.

మరుసటిరోజు, జయంతుడిని ఒక్కడినీ ఇంట్లో వదిలి, మేము ఆఫీసులకు బయలుదేరాము.

మోటారుసైకిల్ పై నేను. చౌరస్తా చివర, ఎవడో గుడ్డివాడు, మనోహరమైన వేణుగానం వినిపిస్తున్నాడు. అతన్ని ఎవరూ పట్టించు కోవటం లేదు. ఎందుకీ సంగీతాలు, పాటలు అన్నట్లుగా. మధ్యలో ట్రాఫిక్ జామ్. విసుగు, చెమట, చుట్టూ శరీరాల రాపిడి. ట్రాఫిక్ జామ్ మధ్యలోంచి మే, మే అంటూ మేకల అరుపులు. ఉలిక్కిపడి చూశాను. నలభైయేళ్ళ ఆడమనిషి, స్కూటర్ పై ఆరుమేకల్ని కట్టుకొని హాండిల్‌కు ముందు సీటుకు, మూడు మేకలు, వెనక మూడు

మేకలు. అవి మే, మే అని దీనంగా అరుస్తున్నాయి. ఆ మేకలను బహుశా కబేళాకు తీసుకెళ్ళుతుందేమో. ట్రాఫిక్‌జామ్‌లో ముందుకు చొచ్చుకుపోతూ, ఆమె, "సాలె, హఠో, హఠో," అని పెద్దగా అరుస్తూ. మేకల శరీరాలు, నా శరీరాన్ని రాసుకుంటున్నాయి. కాలితో, నా మోటారు సైకిల్ని పక్కకు జరిపి, ముందుకు కదిలింది ఆమె. "సాలె, హఠోహఠో," ఆమె అరుస్తూనే ఉంది. నాకు ఊపిరాడనట్లుగా ఉంది.

ట్రాఫిక్ కాస్త కదిలింది. "సాలె, హఠో హఠో," ఆమె అరుస్తూ ముందుకు వెళుతుంది. ఆమె ముఖం ఎందుకో కోపంగా ఉంది. సముద్రాన్ని చీల్చుకొని వెళుతున్న మోజెస్‌లా ఆమె. వేగంగా వెళుతూ వెళుతూ హఠాత్తుగా ఆమె స్కూటర్ స్కిడ్ అయ్యింది. దభేల్ మని పడి, రోడ్డుపై కొద్ది దూరం ఈడ్వబడి, డివైడర్‌ని కొట్టుకొని ఆమె కాలో చెయ్యో విరిగినట్లుంది. పైకి లేవలేకపోతుంది. మూడు మేకలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. వాటి శరీరాల నిండా రక్తం. మరో మూడు మేకలు స్కూటర్ కింద పడి, మే మే అంటూ హృదయ విదారకంగా అరుస్తూ. ఆమెను లేపే ప్రయత్నం ఎవరూ చెయ్యలేదు. ఆ దృశ్యాన్ని, అరుపుల్ని దాటుకుంటూ, జనం నిర్లిప్తంగా, తమ గమ్యాల వైపు వెళుతున్నారు.

సాయంకాలం ఐదున్నరకే ఆఫీసు నుంచి బయటపడ్డాను. బయట కుండపోతగా వాన. రోడ్లన్నీ నీళ్ళలో మునిగి, ఎక్కడి వాహనా లక్కడే. సుదీర్ఘమైన ట్రాఫిక్ జామ్. గంటలు గడిచిపోయాయి. బస్సులు, వాహనాలు కదలవు. సిటీ అంతా స్తంభించిపోయి, కదలిక ఆగిపోయింది. ఉపద్రవంలా, డిజాస్టర్‌లా. ఆగిపోయిన ట్రాఫిక్ మధ్య లో మోటారుసైకిలు ఆపుకొని, ఆ కాస్త స్పేస్‌లో ఎన్ని వందల వాహనాలు, ఆగి ఉన్నాయో లెక్క పెట్టటం మొదలు పెట్టాను. ఎన్ని వందల కార్లు. ఎన్ని మారుతీలు, ఎన్ని హోండాలు, ఎన్ని టయోటాలు.





అపార్టుమెంటు గుర్తుకొచ్చింది. చుట్టూ నీళ్ళు, సముద్రంలా మూగుతా యి. ఒంటరి అపార్ట్‌మెంట్‌లో జయంతుడు. గుండెల్లో అలజడి, దిగులు. ట్రాఫిక్ నత్తలాగా, అడుగులో అడుగు వేసుకుంటూ, రాత్రి పదిగంటలకు కాలనీ చేరాను. ఎటు చూసిన నీళ్ళు. వాన తరువాత మిగిలిన విధ్వంసం అన్నివైపులా. అపార్టుమెంటు చూట్టూ నీళ్ళు. కార్లు, మోటారు సైకిళ్ళు అందులో మునిగిపోయి ఉన్నాయి. నీటిపై తేలాడుతూ చెప్పులు, పిల్లల ఆటవస్తువులు. సమస్తం ముగింపు కొచ్చి నప్పుడు, ముఖాల్లాంటి ముఖాలతో జనం, నీళ్ళను ఈదుకుంటూ ఇళ్ళకు చేరుకుంటున్నారు. కోమలి పదకొండు గంటలకు ఇంటికి చేరింది. అపార్ట్‌మెంట్ నిండా నీళ్లు. వంటగదిలోకి, బెడ్‌రూములోకి నీళ్ళు వచ్చాయి. మేము నీళ్ళను తోడివేసే ప్రయత్నం చేయటంలేదు. కోమలి అన్నం వండే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. బట్టలు విడిచేసి, దేవతా విగ్రహాల్లాగా నిద్రకు ఉపక్రమించాము. జయంత్ జ్వరం తగ్గలేదు. గదులన్నీ నీళ్ళలో తేలాడుతున్నాయి. జయంతుడు చలికి వణుకుతున్నాడు. రెండు మూడు రగ్గులు వాడి చుట్టూ కప్పి, జయం తుడిని దగ్గరగా పొదువుకొని, పొడవాటి బల్లపై పడుకున్నాము, మేం ముగ్గురం. వీథుల్లో పెద్దపెద్ద ఫ్లడ్‌లైట్లు. టీవీ ఛానళ్ళ వాళ్ళు వీథుల నగ్న స్వరూపాల్ని రికార్డు చేస్తున్నారు. వీథుల్లో పెద్దపెద్ద చప్పుళ్ళు, మోటార్లతో నీళ్ళను తోడివేస్తూ. నిద్రపోయే ముందు కోమలి, "ఏమిటిది, ఏదో శాపం తగిలినవాళ్లలా," అంది.

ఆ మరుసటిరోజు పేపర్లో రెండు ప్రముఖమైన వార్తలు కనబడ్డాయి. ఒకటి, వరద నీటివల్లనో, అడవులు నరికేయటం వల్లనో అడవుల్లోని చిరుతలు, కొండచిలువలు, చెరువుల్లోని మొసళ్లు నగరం లోకి ప్రవేశిస్తున్నాయని వార్త. మరో ముఖ్యమైన వార్త నన్నెంతో కలవర పరిచింది. పౌరహక్కుల నాయకుడి సమాధి కనబడకుండా పోయిం

దంటూ వార్త. ఆ సమాధులున్న ప్రాంతంలో ఇప్పుడో అపార్ట్ మెంటు వెలిసిందనే వార్త. ఆరునెలల క్రితం ఆ సమాధిని చూశాను, కొద్దిమంది మిత్రులతో కలిసి. చుట్టూ పచ్చిక పెరిగి, మధ్యలో గుబురుగా, బోగన్ విల్లియా పొదలు. ఆ రోజు ఆ సమాధిని శుభ్రంగా కడిగి, పూలబొకేలు అలంకరించి, ఆవేళ ఆ సమాధి ముందు కూర్చుని, ఇద్దరు అమ్మాయిలు లోగొంతుకతో పాడిన రవీంద్రుని గీతం, నాకింకా గుర్తుంది. సమాధి పైనున్న పసుపుపచ్చని పూలు లేఎండలో, తళుక్కుమంటుంటే, పైన తెల్లని మేఘం మిలమిల లాడుతుండగా, ఎందుకో ఆ ఉదయం, ఆయన (మహమ్మద్ యూనస్) చనిపోలేదనీ, మరెక్కడో పుడుతూనో, పెరుగుతూనో ఉండి ఉంటాడనిపించింది. ఆరోజు అక్కడకు వచ్చిన వాళ్ళలో ఒకరు అన్నట్లుగా, ఆ సమాధిని చూస్తే ఒక ధైర్యం కలుగుతుందనిపించింది.

మధ్యాహ్నం లంచ్‌టైమ్‌లో, సమాధులు కూల్చిన ప్రదేశాన్ని చూడాలని బయల్దేరాను. ఆకాశం నీలపురంగులో ఉంది. అపార్ట్ మెంట్లపై ఎండ పొడ పడి, అపార్టుమెంట్లు అద్దాల్లా మెరుస్తున్నాయి. వందలాది అపార్ట్‌మెంట్లు, వాటి మధ్య ప్రదేశాల పోలికలే తెలియటం లేదు. ఆ అపార్టుమెంట్ల మధ్యన నడుస్తుండగా, ఒక ఆశ్చర్యకరమైన దృశ్యం కనబడింది. ఎత్తైన అపార్టుమెంట్ల మధ్యన, ఒకచోట సగం కూలిన మేడ కనబడింది. బుల్‌డోజర్లతో మేడ ప్రహరీగోడల్ని కూల్చివేసినట్లుగా, చుట్టూ ఇటుకల గుట్టలు రోడ్డంతా. ఇనుప చువ్వలు బయటకు పొడుచుకు వచ్చి, ఆ శిథిలాల మధ్య పడిపోకుండా మిగిలిన ఒకేఒక గదిపైన, ఒక ముసలి మనిషి కూర్చున్నాడు (అతని పేరు యాదయ్య అని తెలుసుకున్నాను). డెబ్బై ఏళ్ళదాక ఉంటాయి. ముసలి యాదయ్య తలపై పిడికెడు జుట్టు, బాగా పెరిగిన గడ్డం. అతను కూర్చున్న ప్రదేశానికి దగ్గరలో ఒక బేనరు. 'ఆక్రమణదారు,





దోపిడీదారు సుశాంత్‌జైన్ నశించాలి' అంటూ. పడిపోకుండా మిగిల్చిన గోడలపై పోస్టర్లు. 'జనసంఘటన' వాళ్లవి. ముసలి యాదయ్యకు సపోర్టుగా పోస్టర్లలో, ఒకప్పటి ఆ మేడ ఫోటోలు ఫోటోలోని మేడ ముందు, ముసలి యాదయ్యతో పాటు, ఒక కుటుంబం. ఆడు కుంటున్న పిల్లలు. ఆనందం, చిరునవ్వులు, కోలాహలం. ఒక అద్భుత మైన జీవితం. యాదయ్య తన కథ చెప్పాడు. "ఆరు నెలలుగా ఇక్కడే ఉంటున్నాను. ఇక్కడే పడుకుంటున్నాను. వాడు పాతిక లక్షలు ఇస్తా నని బేరం పెట్టాడు. అవసరం లేదన్నాను. చుట్టుపక్కల వాళ్ళంతా వెళ్ళిపోయారు. నేను వెళ్ళదలుచుకోలేదు. పోలీసుల్ని పంపాడు. గూండాల్ని పంపేడు. నేను బెదరలేదు. ఒక అర్ధరాత్రి బుల్‌డోజర్లు తెచ్చి ప్రహరీగోడను ధ్వంసం చేశారు. కొడుకు, కోడలు, మనవళ్ళు భయపడ్డారు. వెళ్ళిపోయారు. నేను మాత్రం వెళ్ళదలుచుకోలేదు. ఫ్రెండ్ ఒకడు రోజూ అన్నం పంపిస్తున్నాడు. జన సంఘటన అనే వాళ్ళు నాకోసం ఉద్యమం చేస్తున్నారు. గవర్న మెంటుకు పిటిషన్లు పెట్టారు. కోర్టులో పిల్ వేశారు. టీవీ వాళ్ళు ఇంటర్వ్యూ చేశారు. బిల్డర్ కాస్త భయపడ్డాడు. ఎన్నాళ్ళు సాగుద్దో తెలియదుగాని, ఇక్కడ నుంచి కదలదలచుకోలేదు" అన్నాడు. అక్కణ్ణుంచి వచ్చేస్తుంటే, ఢమఢమ మంటూ బుల్డోజరు శబ్దాలు. ఎక్కడో ఒక మేడను కూల్చుతున్న చప్పుడు. దుమ్ము పై కెగసి, సమస్తాన్ని కమ్మివేస్తున్నట్లుగా సాధా రణంగా దుమ్ము, బూడిద రంగులో ఉంటుంది. కానీ, ఈ దుమ్ము నారింజపండు రంగులో కనబడి, ఉలిక్కిపడ్డాను.

జయంతుడి జ్వరం, నేటికి పదహారో రోజు. టెంపరేచర్ ఇంకా 101 డిగ్రీల దగ్గరే ఉంది. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు వెళ్ళాము. పదో, ఇరవయ్యో పరీక్షలు చేశారు. టెంపరేచర్ గురించి కంగారు పడవద్దని చెప్పారు. సిటీలో చాలామందికి ఇట్లా టెంపరేచర్ల

మార్పులు వస్తున్నాయని, కంగారు పడకుండా అన్ని పనులు చేసుకో వచ్చుని సలహా ఇచ్చారు.

ఆ రాత్రి జయంతుడికి, పాత చందమామల్లోంచి 'శిథిలా లయం' కథను చెప్పాను. వాడు అబ్బురపోయాడు. ఆ కథలో గ్రహాం తరవాసులు ఉండటం, వాడికి ఎగ్జైటింగ్‌గా ఉంది. వాడు నిద్ర పోయాక, నేను నిర్లిప్తంగా ఆకాశం వైపు చూశాను. నారింజపండు రంగు వెలుగు. ఫ్లైయింగ్ సాసర్స్‌లో నుంచి నన్ను ఎవరో పలకరిస్తు న్నట్లుగా ఉంది. మరుసటిరోజు ఉదయాన్నే కోమలి తలస్నానం చేసి, గుండ్రటి, పెద్ద బొట్టు పెట్టుకొని, మా కాలనీలో ఉన్న మహిమాన్విత బాబా దగ్గరకు వెళ్ళింది. పూజలు చేయించడానికి.

ఆ రాత్రి ఒక ఆశ్చర్యకరమైన సంగతి జరిగింది.

రాత్రి పన్నెండు దాటినా కోమలి నిద్రపోలేదు. ఇంటి మధ్యన మహిమాన్వితమైన బాబా ఫోటో ఒక వ్యవస్థలాగా, ఒక సంస్థలాగా ఉంది. ఫోటో ఆ చివరన కోమలి, ఈ చివరన నేను. ఆ క్షణంలో ఆ ఫోటో పురాతనమైన సమాధిలాగా ఉంది. భగవంతుని ప్రతిరూపంలా కూడా ఉంది. అదొక పవిత్రస్థలంలా కూడా అనిపించింది. అది ప్రేమగా మమ్మల్ని ఆహ్వానిస్తుంది. మా శరీరాల్ని మహా మాయలాగా కౌగలించుకోవాలని చూస్తుంది. నేను కోమలి చేతుల్ని ముట్టు కున్నాను. అవి వణుకుతున్నాయి. ఆమెను దగ్గరకు లాక్కుని, ఇద్దరం అక్కడే నేలపై పడుకొని, శక్తివంతమైన దేవతామూర్తి ముందు, వినమ్రంగా తలలు వంచినట్లు, మా శరీరాలు నేలపైన ఒదిగి పోయాయి. పురాగాథలేవో మాకు వినిపిస్తుండగా, మాకు నిద్ర పట్టింది. ఫోటో మాతో సంభాషిస్తున్నట్లుగా ఉంది. హిప్నాటిస్ట్‌లా, 'ఇంక చాలు, నిద్రపొండి. జీవితంతో రాజీపడండి. రాబోయేదంతా విధ్వంసమే, ఇప్పుడు కాస్త కునుకు తీయండి,' అని మా చెవిలో





గుసగుసలాడుతున్నట్లుగా అనిపించింది. మా చెవుల్లో మధురమైన వేణుగానం ఏదో వినిపిస్తున్నట్లుగా ఉంది.

చాలాసేపటి తర్వాత, మాతోపాటు రాత్రి కూడా నిద్ర పోయింది. సమస్తం నిశ్శబ్దంగా మారింది. ఆకాశం నిండా పాల వెన్నెల తెలుపు. చంద్రుడు, నక్షత్రం, సమస్తం, ఒకానొక గాఢమైన, సాంద్ర మైన భావంలా కరిగిపోయి మేము గాఢమైన నిద్రగా మిగిలి పోయాము.

నిద్రపోయే ముందు కోమలి అన్నమాటలు నన్ను భయ కంపితుణ్ణి చేశాయి. ''ఎంత బలహీనులమైపోయాము మనం. గడ్డి పోచకన్నా హీనం. ఎవరికో ఒకరికి సరెండర్ కాకపోతే బ్రతకలేని పరిస్థితి,'' అంది నా శరీరాన్ని గట్టిగా కరుచుకుంటూ. ''ఇప్పుడీ ఫోటో మన కొత్త ఆశ. కొత్త దేవుడిలాగా.'' కోమలి, ఎందుకో పెద్దగా ఏడ్చింది. ఏడ్చిఏడ్చి గాఢమైన నిద్రగా మారిపోయింది.

సంక్రాంతి రోజులు:

కోమలి అనిమేషంగా పైకప్పు వైపు చూస్తోంది. వేకువజాము నాలుగు దాటింది. జయంతుడు గాఢనిద్రలో వున్నాడు. వీథిలో పెద్దగా అరుపులు, కేకలు. అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా వున్న ఒడ్డెర వీథిలో వున్న పిల్లలు పెద్దగా అరుస్తున్నారు- ''అరేయ్ భోగిమంటరా, ఆ మొద్దులు ఈడవండి ఇటూ,'' అంటూ. లావాటి మొద్దులు ఈడ్చుకొచ్చి రోడ్డు మధ్యలో వేస్తున్నారు. విరిగిపోయిన కుర్చీలు, టేబుళ్ళు ఎక్కడెక్కడినుంచో సేకరించినవి. అక్కడొక పర్వతం వెలిసింది. కాస్త కిరసనాయిల్ పోసి భగ్గుమంది మంట. వీథంతా వెలిగిపోయింది. ''కోమలీ లే అట్లా బయటకు వెళదాం'' అన్నాను. ఏ కదలికా లేదు. జయంతుడిని లేపాను. ''భోగిమంట, భోగిమంటరా రా వీథిలోకి వెళదాం'' అన్నాను. ''భోగిమంటా,'' అంటూ రెండు

మూడుసార్లు గొణుక్కుని చటుక్కున మంచంపై నించి లేచి నాతో నడిచాడు. కలలోంచి నడచివస్తున్న దానిలా కోమలి కూడా మాతో వచ్చింది. నరికేసిన చెట్ల తాలూకు మొద్దులను నలుగురు కుర్రాళ్ళు మంట దగ్గరికి మోసుకొస్తున్నారు. పైన ఆకాశంలో చంద్రుడు మంచు దారాలకు వేలాడుతూ, వెన్నెల మంచుకత్తిలా మిలమిల లాడుతుంది.

"రా, శరీరాన్ని వెచ్చబరుద్దాం, మనలోపలి మంచు పర్వతాల్ని నిప్పుల్లోకి విసిరేద్దాం," అన్నాను పొయెటిక్‌గా కోమలి వైపు చూస్తూ. నిర్లిప్తంగా అపరిచితంగా నా వైపు చూసింది. "అట్లా మాట్లాడకు, పిచ్చి వాడనుకుంటారు ఈ జనం," అంది సన్నటి గొంతుతో.

చుట్టూ ఇరవైమందికి పైగా దుప్పట్లు కప్పుకున్న మగ వాళ్ళు, కొంగుల్ని శరీరం చుట్టూ చుట్టుకొని ముచ్చటయిన శిలల్లా కూర్చున్న ఒడ్డెర యువతులు, కేరింతలాడుతున్న పిల్లలు. జయం తుడు ఆ ఉత్సాహంలో కలిసిపోయాడు. చెక్కల్ని ఎగదోస్తూ, వాడి ముఖం నిండా ఎర్రటి మంటల మిలమిలలు. నా శరీరంలోనూ వెచ్చని జ్ఞాపకాలేవో ఎగజిమ్మినట్ల యి, తెలియని ఉత్సాహం ఎగసి. అటుఇటూ తలతిప్పి, చాటుగా సిగిరెట్ తాగుతున్న వాచ్‌మెన్ వైపు చూసి, "ఒక సిగిరెట్ ఇవ్వు," అన్నాను. సిగిరెట్ ముట్టిస్తున్న నా వైపు ఆశ్చర్యంగా చూసింది కోమలి. కళ్ళని చికిలించి జయంతుడిని దగ్గరగా జరుపుకొని హఠాత్తుగా తల పైకెత్తి ఆకాశం వైపు చూసింది. సరిగ్గా మా తలలపైనే ఎక్కుపెట్టిన అజ్ఞాత ఆయుధంలా జిగేలుమంటూ నారింజపండు రంగు వెలుగు. "గో టు హెల్ అన్నాను," పెద్దగా ఆకాశం వైపు చూస్తూ. కోమలి, జయంతుడు నిశ్శబ్దంగా నా వైపు చూస్తున్నారు. బహుశా నా శరీరం వెలుగుల వృక్షంలా వుందేమో, బహుశా ఆ క్షణంలో నేను కొత్త మానవుడిలా కనిపించానేమో. నా





వెనుకనున్న లావాటి మొద్దును తెచ్చి నిప్పుల మధ్యలోకి విసిరాను. భగ్గుమంటూ మంట పైకి లేచింది. అన్నివైపులకూ వెచ్చనిదేదో ప్రసరిస్తుంది. కోమలి కళ్ళలోని మౌనం నాకు తెలుస్తుంది. ఈ వెచ్చదనం ఎంతసేపు, మరో పదో ఇరవయ్యో నిమిషాలే గదా అన్నట్టుగా చూస్తోంది,

ఆశలు ఉనికి లేనిదానిలా నిర్జీవంగా చూస్తున్న కోమలి వైపుకు ఒక మంట, గాలి వేగానికి అలలా తోసుకువచ్చి కోమలిని చుట్టు ముట్టి క్షణం సేపు అగ్నిదేవతలా వెలిగిపోయింది. ఆ మంట గాలి అంచులపై కాస్సేపు నాట్యం చేసి, ఆకాశం వైపు ప్రయాణించింది. ఆ మంట ముందు ఆకాశంలోని నారింజ పండు రంగు వెలుగు వెలవెలపోయి నట్లుగా అనిపించింది.

గుంపులోంచి ఎవరో సినిమా పాటని అందుకున్నారు. ఆ పాటయినాక ఒక ముసలమ్మ బతుకమ్మ పాటని రగిలించింది. సైకిల్‌పై టీ కెటిల్ పెట్టుకొని టీ అమ్ముకునే పిల్లవాడు అటు వచ్చాడు. మంట కాగుతున్న అందరికీ టీ అందించాడు. కోమలి చేతిలో టీ కప్పు. టీని బతుకమ్మ పాటనీ కలిసి తాగుతున్నట్లుగా, పూర్ణలో చిన్న కదలిక. ఆ పాటి కదలికకే నాలో ఉత్సాహం. కోమలికి దగ్గరగా జరిగి, నా రెండు చేతుల మధ్యకు ఆమెను జరుపుకొని దగ్గరగా ఆమెకు మాత్రమే వినపడేలా, "నీకు జాక్‌లండన్ కథ టు బిల్డ్ ఎ ఫైర్ గుర్తుంది కదా," అన్నాను.

అలాస్కా మంచు పర్వతాల మధ్య ప్రయాణిస్తున్న మనిషి కథ మంచు పర్వతాల మధ్య చలిమంటలు వెలిగించుకోవాలని అతని ప్రయత్నం. ఆ నిప్పు వెలగాలి. లేకపోతే అతను గడ్డకట్టి చని పోతాడు కోమలి నావైపు చూసింది, తన కళ్ళలో భోగిమంటల వెలుగులు. ఆ కథ కోమలికి కొద్దిగా గుర్తుకొస్తున్నట్లుగా వుంది.

బహుశా స్కూల్‌ఫైనల్లోనో, ప్లస్ టూలోనో చదివివుంటుంది. కోమలి ముఖంలో వణుకు, గుండె వేగంగా కొట్టుకుంటున్నట్లుగా నేను ఆ కథను కోమలికి వివరిస్తూనే వున్నాను. ఆ మనిషి మరణపు అంచుల్లో వున్నాడు కానీ అతను చుట్టూ వున్న పరిసరాలతో పోరాడటానికే నిర్ణయించుకున్నాడు. పోరాటంలో గెలవాలన్నది అతని ప్రయత్నం. అతను అప్పుడో నిప్పును వెలిగించాలి. అతను బతకడానికి మాత్రమే కాదు, ప్రకృతిపై తన అధికారాన్ని నిరూపించడానికి కూడా.

పెద్ద మానును తెచ్చి మంటల మధ్య వేశారు. మనిషంత ఎత్తు మంటలు పైకి లేచాయి. అందరం దూరంగా జరిగాం. కోమలి కొద్దిగా పక్కకు జరిగి ఆ మంట వైపే నిశ్చలంగా చూడసాగింది. నాకు దగ్గరగా జరిగి తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా, నాకు మాత్రమే విన పడేలా ఈ మధ్యకాలంలో "నన్నో కల వెంటాడుతుంది, కల నిండా చీకటి. చీకట్లో నేను కొద్దికొద్దిగా మరణిస్తూ, నా శరీరమంతా చెమటతో తడిచిపోతుంది. ఉలిక్కిపడి నిద్రలేస్తాను. అయినా కల ముగియదు. కళ్ళు తెరుస్తాను. కానీ కల ముగింపుకు రాదు. నాలో ఏదో జరుగు తున్నట్లు నాలోపలి వెలుతురంతా ఎవరో తోడేస్తున్నట్లు ఆకాశం లోంచి రెండు యంత్రహస్తాలు నన్ను తమ వైపుకు లాగివేసుకుంటు న్నట్లు"-

భోగిమంట కాస్త చల్లారింది. నిప్పులపై సన్నటి బూడిద. హఠాత్తుగా కోమలి నా వైపు తిరిగి, "జాక్‌లండన్ కథ గుర్తుకు వచ్చింది. స్కూల్‌లో చదివాను. ఎంత గొప్ప క్యారెక్టర్. బ్రతకటం కోసం ఎంత పోరాటం చేశాడో" అంది. కోమలి అట్లా చాలాసేపు ఆ కథ గురించే మాట్లాడింది. మాట్లాడుతున్నట్లుగాగాక అదో స్వగతంలా వినిపించ సాగింది. కోమలి కళ్ళలో ధారలుగా కన్నీళ్ళు. కాస్సేపయినాక నా మోకాళ్ళ చుట్టూ తన చేతులని గట్టిగా పెనవేసి, నేనూ, తనకు దగ్గరగా





జరిగి, నా చేతులని తన చుట్టూ కప్పి కోమలి, “అంతా బయటకు వచ్చేసింది. నేను ఖాళీ అయ్యాను,” అంది. కోమలి ముఖంపై పడిన భోగిమంట వెలుగు ఆమె పెదవులపై విచ్చుకుంటున్న సన్నటి నవ్వుతెరని నాకు చూపింది. నా మోకాళ్ళపై తలని పెట్టుకొని, “నిద్ర వస్తుంది కాస్సేపు కునుకు తీస్తాను, నిప్పు పూర్తిగా ఆరిపోయినాక లేపు, ఇంట్లోకి వెళదాం,” అంది.

నిద్రపోయేముందు ఆకాశం వైపు చూసింది. ఎప్పటిలాగే నారింజ పండు రంగు వెలుగులు ఫౌంటెన్‌లా, భయపెట్టే కాంతిని వెదజల్లుతూ. కానీ కోమలి దాన్ని పట్టించుకోనట్లుగా నన్ను గట్టిగా దగ్గరకు జరుపుకుంది.

*పాలపిట్ట ప్రత్యేక కథల సంచిక, మార్చి 2011*